క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



కర్లపాలెం: కర్లపాలెం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులకు విద్యార్థులు చురుగ్గా పాల్గొంటున్నారని గ్రంథాలయ అధికారిణి రమణమ్మ పేర్కొన్నారు. గురువారం వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం, చిత్రలేఖనం, ఆటపాటల్లో విద్యార్థులకు ఆసక్తి పెంపొందించేందుకు గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు దోహదపడుతాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: రేపల్లె పట్టణం నుంచి అరవపల్లి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో విధించే కోతకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ రేపు..



కర్లపాలెం: పాత నందాయపాలెంలో శనివారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు గ్రామపెద్దలు ఏర్పాటు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా గురువారం ఆలయంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అభయాంజనేయస్వామి ఉత్సవమూర్తి నగరోత్సవం వైభవంగా జరిగింది.

పంపిణీకి సిద్ధంగా జగనన్న విద్యా కానుక



కర్లపాలెం: విద్యార్థులందరికీ ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే జగనన్న విద్యాకానుక పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ టీయూ మనోరంజని గురువారం తెలిపారు. పుస్తకాలు, యూనిఫాం, షూ సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు కానుక కిట్ పంపిణీ చేసేందుకు యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టోర్ రూమ్‌ను ఎంఈవో పరిశీలించారు. మండల పరిధిలో 1 నుంచి 10వ తరగతి వరకు సుమారుగా 3,138మంది విద్యార్థులున్నారని, వారికి యూనిఫాం 3,138 జతలు, షూ 3,373 జతలు, 20125 బుక్స్ పంపిణీ కోసం సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

జై భీమ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా రమేష్

రేపల్లె: జై భీమ్ భారత్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా ఆ పార్టీ రేపల్లె నియోజకవర్గ కన్వీనర్ దోవా రమేష్ రాంజీ నియమితులయ్యారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. రమేష్ రాంజీ స్థానిక కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తనపై నమ్మకంతో పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేడికొండ జయకుమార్ బాధ్యతలు అప్పగించటం ఆనందంగా ఉందన్నారు.

ఐలవరంలో హిందూ సామ్రాజ్య దినోత్సవాలు



ఐలవరం(భట్టిప్రోలు): హిందూ సామ్రాజ్య దినోత్సవం పురస్కరించుకుని ఎస్ఎస్ఎఫ్ సభ్యులు ఐలవరంలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ పట్టాభిషిక్తుడైన పర్వదినాన్ని భారత దేశంలో హిందూ సామ్రాజ్య దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరియోజనా ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, వి.కోటేశ్వరరావు, ఎం.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

పెదకాకాని: బాలుడు అదృశ్యంపై పెదకాకాని పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని మద్దిరాల కాలనీలో పెద్దమ్మ ప్రమీల వద్ద ఉంటూ యశ్వంత్ ఓ స్కూలులో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. బుధవారం ఇంటి నుంచి వెళ్లిన యశ్వంత్ తిరిగి రాకపోవడంతో బంధువుల్ని విచారించారు. ఆచూకీ తెలియకపోవడంతో ప్రమీల గురువారం పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

రైతుల అభ్యున్నతికి పాటుపడుతున్న జగనన్న

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

వరహాపురం(వేమూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుల అభ్యున్నతికి పాటు పడుతున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. వరహాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు చేసిన మేలును లబ్ధిదారులకు వివరించారు. సంక్షేమ పథకాల అమలును, స్థానిక సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్ అన్ని వర్గాల అభ్యున్నతికి నిరంతం పాటు పడుతున్నారని, ఈ మేరకు నవరత్నాలు పథకాలు క్రమం తప్పకుండా అమలు చేస్తున్నారని కొనియాడారు. సంక్షేమ క్యాలెండర్ విడదల చేసిన ముఖ్యమంత్రిని ఇంత వరకు చూడలేదని పేర్కొన్నారు. నాలుగేళ్లుగా సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టాయన్నారు. లబ్ధిదారుల ఖాతాలో నేరుగా నగదు జమచేయడం ఇష్టంలేని టీడీపీ నాయకులు.. రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారనే విమర్శలకు దిగారని మండిపడ్డారు. ఎదోవిధంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందకుండా..చేయాలన్నదే వారి ప్రధాన ధ్యేయమని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహనరావు, చందోలు డేవిడ్ విజయకుమార్, బొల్లిముంత ఏడుకొండలు, దాది సుబ్బారావు, గాజుల మోహన్, దున్నా మేరీసుబాబు, తలతోటి సువర్ణరావు, రాపర్ల నరేంద్ర, సజ్జా శ్రీనివాసరావు, తాడికొండ శ్రీనుబాబు, వెల్లబాడు బుల్లియ్య, దాసరి ముత్తయ్య, ఎలిచర్ల దేవదానమ్మ, యల్లమాటి పరిశుద్ధరావు, యల్లమాటి భాస్కరరావు, యల్లమాటి చంటి, అరమళ్ల సంధ్యారాణి, ఈపూరు ప్రసాద్, యల్లమాటి సుదర్శనరావు, యల్లమాటి శ్రీనివాసరరావు, యల్లమాటి వెంకయ్య, కండెల మోహన్, పెరవలి శాంసన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

వేమూరు మండలంలోని వరహాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించడం జరుగుతుందని బొల్లిముంత ఏడుకొండలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని పేర్కొన్నారు.

80శాతం పింఛన్ల పంపిణీ



దివ్యాంగుడికి పింఛను నగదు అందజేస్తున్న వలంటీరు మహేష్

రేపల్లె రూరల్: రేపల్లె పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ జోరుగా సాగుతోంది. పట్టణంలో 4,604 మంది పింఛన్‌దారులకు.. తొలిరోజు గురువారం 80 శాతం మందికి వలంటీర్లు పింఛను పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ విజయసారథి తెలిపారు. రేపల్లె రూరల్‌లో 28 పంచాయతీల్లో 9,726 మంది లబ్ధిదారులు ఉండగా తొలిరోజు 60 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో మల్లికార్జునరావు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు 2, 3తేదీల్లో పంపిణీ చేయటం జరుగుతుందని అధికారులు తెలిపారు.

మొదటి రోజే 86.71శాతం పింఛన్ల పంపిణీ

చెరుకుపల్లి: మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 9,542 మంది సామాజిక పింఛన్ల లబ్ధిదారులకు రూ.2.80కోట్లు ప్రభుత్వం విడుదల చేసినట్లు ఎంపీడీవో బి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం 86.71 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. వలంటీర్లు మొదటిరోజే నూరు శాతం పింఛన్లు పంపిణీ చేసేవిధంగా ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని సూచించారు.

త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి

రేపల్లె ఆర్డీవో జగన్నాథం పార్థసారథి



సమీక్షిస్తున్న ఆర్డీఓ పార్థసారథి, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

భట్టిప్రోలు: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తోందని రేపల్లె ఆర్డీవో జగన్నాథం పార్థసారథి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ పార్థసారథి మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్న దృష్ట్యా జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు చేపట్టే దిశగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పని చేయాలని కోరారు. అధికారులు తమకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే గృహ నిర్మాణాలు మొదలు పెట్టని వారి వివరాలు సేకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎంఎల్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాస్త స్పందించండి..

- 20 రోజులుగా సరఫరా అవుతున్న నీరు
- నత్తలవారిపాలెం గ్రామస్తులకు తప్పని ఇబ్బందులు
- సమస్యను చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన
- పరిష్కరించామంటున్న పంచాయతీ కార్యదర్శి



సరఫరా అయిన నీరు..

పిట్టలవానిపాలెం: అల్లూరు పంచాయతీ పరిధిలోని నత్తలవారిపాలెం గ్రామంలో గత 20 రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఫిల్టర్ కాకపోవడంతో నీరు నల్లగా, దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని అనేకసార్లు గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకున్నవారు లేరని గ్రామస్తులు చెబుతున్నారు. పంచాయతీ సరఫరా చేస్తున్న నీరు కనీసం వాడుకునేందుకు కూడా పనికిరాని విధంగా ఉందని, ఒక వేళ ఆ నీటిని వినియోగిస్తే శరీరంపై దద్దుర్లు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా స్పందించి మంచినీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

20 రోజులుగా కలుషిత నీరు సరఫరా



20 రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోంది. గ్రామ పంచాయతీ కార్యదర్శికి అనేక సార్లు తెలిపినా.. పట్టించుకోలేదు. కనీసం సమాధానం చెప్పే పరిస్థితి కూడా లేదు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

–మేకల ఎలీషా, నత్తలవారిపాలెం.

సమస్యను పరిష్కరించాం



గ్రామ పంచాయతీలో కలుషిత నీరు సరఫరా అయిన మాట వాస్తవమే. కానీ వారం రోజుల క్రితం సమస్యను పరిష్కరించాం. ప్రస్తుతం ఎలాంటి సమస్యా లేదు.

– దాసరి శివకుమార్, గ్రామ కార్యదర్శి.

ఉపాధ్యాయ ఉద్యమ నేత విజయరామరాజుకు నివాళి



విజయరామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మోహనరావు, నరసింహారావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల హక్కుల సాధన, సంక్షేమం కోసం పాటుపడిన ఉద్యమ నిర్మాతల్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు తెలిపారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో గురువారం ఉపాధ్యాయ ఉద్యమనేత, మాజీ ఎమ్మెల్సీ వీణా విజయరామరాజు శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం జీవితాన్ని ధారపోసిన ఉపాధ్యాయ ఉద్యమ పితామహునిగా వీణా విజయరామరాజు చిరస్మరణీయుడన్నారు. ఉపాధ్యాయవాణి సంపాదకునిగా ఆయన సేవలు నిరుపమానమని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, రాష్ట్ర కౌన్సిలర్లు డి.ఎ.జోసెఫ్, ఎం.పి.సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు పేరేచర్ల శ్రీనివాసరావు, కె.వి.రమణ, బి. విజయబాబు పాల్గొన్నారు.

4న గ్రూప్-1, గ్రూప్-2పై అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించనున్న గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఈనెల 4న అమిగోస్ 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ పి.కృష్ణప్రదీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని అకాడమీ కార్యాలయంలో జరిగే సదస్సులో గ్రూప్–1, గ్రూప్–2 సిలబస్, ప్రిపరేషన్ స్ట్రాటజీ, నోట్సు మేకింగ్, సమయపాలన తదితర అంశాలపై సీనియర్ అధ్యాపకులతో సమగ్ర అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్న సదస్సులో పాల్గొనే అభ్యర్థులు 040–35052121, 9000230734 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

బధిరుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశం

బాపట్ల అర్బన్: బాపట్ల మండలం, వెదుళ్ళపల్లిలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి. వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 130 సీట్లు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఐదేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు వయస్సు, కనీసం 40 శాతం వైకల్యం గల అర్హులైన బాల, బాలికలకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సాధారణ పాఠశాలల్లోని విద్యార్థులకు కూడా ప్రవేశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 9949004094, 94934 47237, 9000013633 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

దోమల నియంత్రణతో.. వ్యాధుల నివారణ



నిజాంపట్నం: దోమల నియంత్రణతో అనేక వ్యాధులను నివారించవచ్చని డాక్టర్ ప్రణవి పేర్కొన్నారు. మలేరియా మాసోత్సవాల సందర్భంగా కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కూచినపూడి గ్రామంలో ప్రజలకు దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధులను వివరించారు. మలేరియా లక్షణాలు, తీసుకోవాల్సిన చికిత్స విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళీ, ఎంపీహెచ్‌వో, పీహెచ్ఎన్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థికి పీహెచ్‌డీ



చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ మెకానికల్ విభాగ విద్యార్థి కుంచెల బాలకృష్ణారెడ్డికి తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వీసీ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. '' ఎక్స్‌పెరిమెంటల్ ఇన్వెస్టిగేషన్స్ ఆన్ వెల్డ్ బీడ్ జామెట్రీ అండ్ ప్రాసెస్ ఆప్టిమైజేషన్ ఇన్ రోబోట్–అసిస్టెడ్ వైర్ ఆర్క్ అడిటివ్ మ్యానుఫాక్చరింగ్'' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని పేర్కొన్నారు.

గాలివాన బీభత్సం

పెదనందిపాడు: గాలివాన బీభత్సంతో మండలంలో పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సరఫరా నిలిచిపోయింది. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. వరగానిలో బొడ్డు చినబాబుకు చెందిన దూడ పిడుగుపాటుకు మృతి చెందింది. పెదనందిపాడు –బాపట్ల రహదారిలో నాగులపాడు వద్ద చెట్టు కూలి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ సిబ్బంది కూలిపోయిన స్తంభాల్ని పునరుద్ధరించే పనిలో నిమగ్నమయ్యారు. విద్యుత్ లేకపోవడంతో మండలంలో గ్రామాలు అంధకారంలో ఉన్నాయి.

3న విజ్ఞాన మందిరంలో డ్యాన్స్ సోలో పోటీలు



పాత గుంటూరు: స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 3న వెస్ట్రన్ డ్యాన్స్ సోలో పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర డాన్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్యాణ్ తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 3న ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. సాయంత్రం విజేతలకు బహుమతుల ప్రదానంతో పాటు నగరంలోని వివిధ డాన్స్ అకాడమీలకు చెందిన విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు కె.వి. రమేష్, సంయుక్త కార్యదర్శి సీహెచ్. ఉదయకుమార్, సభ్యులు రాజా, వెంకట్, కరీం, రాజాసింగ్ పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్లపై వేధింపులు..ఎంపీపై చర్యలు తీసుకోవాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్



నిరసన వ్యక్తం చేస్తున్న మణిలాల్

రేపల్లె రూరల్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకి పాల్పడిన ఎంపీ బ్రిజ్ భూషణ్‌ని ప్రభుత్వం వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ పేర్కొన్నారు. మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని కోరుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. 50 రోజులుగా ఢిల్లీ నడిబొడ్డున తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మహిళా మల్లయోధులు పోరాడుతున్నారని, 38 కేసుల్లో హత్య, కిడ్నాప్, అత్యాచారం వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీని ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రభుత్వం కాపాడుతోందని విమర్శించారు. దేశానికి ప్రతిష్ఠ తెచ్చిన మహిళా రెజ్లర్లకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.ఆశీర్వాదం, డి.శ్రీనివాస్, ఎం.వెంకటేశ్వరరావు, యు.రామకృష్ణ ప్రసాద్, వై.నవీన్, కె.వెంకటేశ్వరరావు, బాబీ, రవీంద్ర పాల్గొన్నారు.

రెజ్లర్లపై పోలీసుల దాడికి నిరసన



కార్యక్రమంలో మాట్లాడుతున్న మజుందార్

బాపట్ల అర్బన్ : ఢిల్లీలో 30 రోజులుగా ఆందోళన చేస్తున్న రెజ్లర్లపై పోలీసుల దాడికి నిరసనగా గురువారం బాపట్లలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం జరిగింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ పాల్గొని, మాట్లాడారు. బీజేపీ ఎంపీ బ్రిడ్జ్ భూషణ్ చరణ్ సింగ్ పై చర్యలు తీసుకోవాలని 30 రోజులకు పైగా రెజ్లర్లు ఆందోళన చేస్తునా.. నేటికీ వారిపై చర్య తీసుకోకపోవడం దుర్మార్గమైన చర్య అని ఖండించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి జె.శామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



సమస్యలు తెలుసుకుంటున్న వ్యవసాయ, కార్మిక సంఘం నాయకులు

కొల్లూరు: ఉపాధి హామీ పథకం కూలీల సమస్యల పరిష్కారం లక్ష్యంగా ఈ నెల 5న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, జిల్లా సహాయ కార్యదర్శులు బి.అగస్టీన్, బి.సుబ్బారావు కోరారు. గురువారం మండలంలోని క్రాప, అనంతవరం గ్రామాల్లో పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో తీసుకువచ్చిన మార్పులను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ హాజరు విధానం, ప్రతి కుటుంబానికి 200 రోజుల పని దినాలు కల్పించడంతోపాటు, రూ. 600 వ్యక్తిగత వేతనం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

హోరా హోరీగా వైఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నీ



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ షీల్డ్ అందజేస్తున్న మేరుగ చందన్‌నాగ్



బ్యాటింగ్ చేస్తున్న క్రీడాకారుడు

కొల్లూరు : యువత క్రీడల్లో రాణించే విధంగా.. ప్రోత్సహించే ధ్యేయంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్మారకార్థం కొల్లూరులో క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షులు మేరుగ చందన్‌నాగ్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో వైఎస్సార్ స్మారక హార్డ్ టెన్నిస్ బాల్ సీజన్–2 క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. 96 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. ఇప్పటి వరకు 72 జట్లు పోటీపడి 36 జట్లు రెండో రౌండుకు అర్హత సాధించాయి. మరో 24 జట్లు మొదటి దశలో పోటీ పడనున్నాయి. గురువారం ఐదు మ్యాచ్‌లు నిర్వహించగా, కొల్లూరు రెడ్ ఆర్మీ–2 జట్టుపై మోపర్రు జట్టు విజయం సాధించింది. కోళ్లపాలెం, భట్టిప్రోలు (ఆర్‌సీబీ) జట్ల పోరులో భట్టిప్రోలు (ఆర్‌సీబీ) జట్టు గెలుపొందింది. పల్లెకోన జట్టు వరహాపురం జట్టుపై పోటీపడి గెలుపును దక్కించుకుంది. ఈపూరు (చైత్రభూమి), బోస్‌నగర్ జట్ల నడుమ జరిగిన మ్యాచ్‌లో ఈపూరు జట్టు గెలుపొందగా, మోదుకూరు చాలెంజర్స్ జట్టుపై ఆడిన వేటపాలెం జట్టు విజయం సాధించింది. క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ షీల్డ్‌లు, ఓడిన జట్లకు ప్రోత్సాహక బహుమతులు క్రికెట్ బ్యాట్‌లను మేరుగ చందన్‌నాగ్, ఎంపీటీసీ సభ్యురాలు గరిక నీలిమ అందజేశారు. బొద్దులూరుపాడు సర్పంచ్ గుర్రం మురళి, వైఎస్సార్ సీపీ నాయకులు కూచిపూడి మోషే, బొర్ర నాగేశ్వరరావు, ఎరగ్గ పోతురాజు అందజేసిన వారిలో ఉన్నారు. పోటీలను పాలిమేర నవీన్‌రెడ్డి, గరిక రమేష్, సాయి, రవికిరణ్, జాషువ, సునీల్, గంగాధర్, రవితేజ, మనోజ్ పర్యవేక్షిస్తున్నారు.

సిబ్బంది నిర్లక్ష్యం.. రోగులకు ఇక్కట్లు



యువకుడికి వైద్యం అందిస్తున్న 108 వాహన సిబ్బంది

భట్టిప్రోలు: భట్టిప్రోలు పీహెచ్‌సీలో సిబ్బంది తీరుతో వైద్యశాలకు వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రౌండ్‌ది క్లాక్ గా సేవలందించాల్సిన వైద్యశాలలో సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. గురువారం ఉదయం 7:30 సూరేపల్లి పంచాయతీ పరిధిలోని తాతావారిపాలేనికి చెందిన దాసరి సామ్రాజ్యం కుక్క కాటుకు గురై వైద్యశాలకు వచ్చింది. అలాగే తిప్పలకట్ట నుంచి పెదపల్లి జశ్వంత్ అనే యువకుడు వైద్యం చేయించుకునేందుకు వచ్చాడు. వైద్యశాలలో విధి నిర్వహణలో ఉండాల్సిన స్టాఫ్‌నర్స్ లేకపోవడంతో వారు అలానే గంటసేపు నిరీక్షించాల్సి వచ్చింది. ఇంతలో 108 వాహనంలో పని చేస్తున్న ఓ యువతి సదరు యువకుడికి వైద్యసేవలు అందించింది. ఈ విషయమై సీహెచ్‌వో డి.మాతయ్యను వివరణ కోరగా వైద్యురాలు డీఎల్ పద్మజ పరిస్థితిని డీఎంఅండ్ హెచ్‌వో ఎస్.విజయమ్మకు తెలియజేయగా.. స్టాఫ్ నర్సులు సువర్ణ మేరి, సుహాసినీకి మెమోలు జారీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

వైభవంగా వేణుగోపాలస్వామి గ్రామోత్సవం

పాత గుంటూరు: కొత్తపేటలోని శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానంలో శ్రీ రుక్మిణీ సత్య భామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని విశేషంగా అలంకరించారు. ఉదయం గరుడ వాహనంపై గ్రామోత్సవం, మన్యు సూక్త హోమం నిర్వహించారు. రాత్రి దివ్య రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ చైర్మన్ పిచ్చుల జయప్రకాష్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్, ఈవో డి. శ్రీనివాసరావు, అర్చకులు ఆయోధ్య అయ్యప్ప పర్యవేక్షించారు. ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసి పూజ



పాత గుంటూరు: లాలాపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం నిత్య హోమం, బలిహరణ, లక్ష తులసి పూజ నిర్వహించారు. రాత్రి హనుమంత వాహనంపై గ్రామోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమాల్ని దేవస్థానం చైర్మన్ పిచ్చుల జయప్రకాష్‌రెడ్డి, ఈవో డి. శ్రీనివాసరావు, అర్చకులు ప్రసాద్, మురళి, చంద్రకుమార్, శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు. ధరకర్తల మండలి సభ్యులు విశాలాక్ష్మి, వెంకటజ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.